సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శనివారం । 4 । జనవరి । 2025



చిట్టి బుర్రలు.. గట్టి ఆవిష్కరణలు

చిట్టి బుర్రలు అద్భుతాలు సృష్టించాయి. మన చుట్టూ ఉన్న సమస్యలే వారిని ఆలోచింపజేశాయి. వాటికి పరిష్కార మార్గాలను చూపించేలా ఆవిష్కరణల వైపు నడిపించాయి. -IIలో



జల్లా సుదర్శన్‌రెడ్డికి పరామర్శ

న్యాయవాది, వైఎస్ఆర్‌సీపీ నేత జల్లా సుదర్శన్ రెడ్డిని వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తదితరులు కలిశారు. -IIలో

గరిష్టం/కనిష్టం
29.1/18.2

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 18.2 – 29.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

7న జిల్లా స్థాయి మహిళా కబడ్డీ పోటీలు

ప్రొద్దుటూరు: స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్, వైఎస్ఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్‌లో సంక్రాంతి సందర్భంగా ఈనెల 7న నెహ్రూ యువ కేంద్రం, వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ కార్యదర్శి శూలం ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 15–29 ఏళ్లలోపు మహిళలు అర్హులని, పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.7వేలు, తృతీయ బహుమతి రూ.5వేలు ఇస్తామని ఆయన పేర్కొన్నారు. వివరాలకు 9154195061, 96424 71600 సెల్‌నంబర్లకు సంప్రదించాలని కోరారు.

ఆలిండియా క్యారమ్స్‌పోటీలకు అంపైర్‌గా కృష్ణయ్య



కడప స్పోర్ట్స్: ఆలిండియా క్యారమ్స్ పోటీలకు అంపైర్‌గా ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లా నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సూరే కృష్ణయ్య ఎంపికయ్యారు. జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు నెల్లూరులో నిర్వహించనున్న ఆలిండియా క్యారమ్స్ పోటీలకు ఈయన అంపైర్‌గా వ్యవహరించనున్నట్లు జిల్లా క్యారమ్స్ అసోసియేషన్ చైర్మన్ పోలంకి గణేష్‌బాబు తెలిపారు. జిల్లా నుంచి జాతీయస్థాయి అంపైర్‌గా ఎంపికవడంపై అభినందనలు తెలిపారు.

ముగిసిన కేంద్రమంత్రి పర్యటన

కడప సెవెన్‌రోడ్స్: కేంద్ర శాస్త్ర సాంకేతిక, భౌగోళిక శాస్త్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ జిల్లాలో తన మూడు రోజుల పర్యటన ముగించుకొని శుక్రవారం ఉదయం రోడ్డు మార్గాన తిరుపతి రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లారు. కేంద్ర మంత్రికి కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేసి ఘన వీడ్కోలు పలికారు. అలాగే ఎమ్మెల్యేలు మాధవిరెడ్డి, ఆదినారాయణ రెడ్డి, కృష్ణ చైతన్య రెడ్డితోపాటు కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ ఇమ్రాన్, ఇంఛార్జి సీపీవో హాజరతయ్య తదితరులు మంత్రికి వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్: భూ సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు శనివారం జిల్లాలో 23 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బద్వేలు రెవెన్యూ డివిజన్‌లోని బొడుగుండుపల్లి, ముసల్‌రెడ్డిపల్లి, ఇటుగుల్లపాడు, ఎస్. వీర్లపల్లి, ఎస్.లింగంపల్లిలో సదస్సులు జరగనున్నాయి. పులివెందుల రెవిన్యూ డివిజన్‌లోని చక్రాయపేట, వడ్లవానిపల్లె, నిడివెలగల, కనంపల్లి, జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్‌లోని రామచంద్రపురం, రంగసాయిపురం, పొన్నంపల్లి, పాపాయపల్లి, నాగిరెడ్డిపల్లి, మురుగంపల్లి, సంకేపల్లి, కొత్తగుంటపల్లి, రాజులగురవాయిపల్లి, అన్నపుశాస్త్రులపల్లె, బద్రిపల్లెలో నిర్వహించనున్నారు. కడప రెవెన్యూ డివిజన్ లోని చిన్నదాసరిపల్లె, బలుపల్లె, మీరాపురం గ్రామాలలో శనివారం రెవెన్యూ సదస్సులు జరుగనున్నాయని డీఆర్వో వివరించారు.

పులులపై నిఘానేత్రం

- శ్రీశైలం టు శేషాచలం అడుగులు
- శ్రీశైలం బయోల్యాబ్‌లో విశ్లేషణ ప్రక్రియ
- డేటాలోని చిత్రాలు పరిశీలన
- 45రోజుల పాటు అడవిలో లెక్కింపు





శేషచలం



రాజంపేట: నాగార్జునసాగర్–శ్రీశైలం అభయారణ్యంలో పులుల కారిడార్ విస్తరిస్తోంది. నల్లమల నుంచి శేషాచలం అడవుల వరకు పులుల సంచారం ఉన్నట్లు అటవీశాఖ గుర్తించిన సంగతి విధితమే. గతంలో పులులు తిరిగే ప్రాంతం గుంటూరు, కర్నూలు, ప్రకాశం జిల్లాల పరిధిలో మాత్రమే ఉండేది. ఆ మూడు జిల్లాలోని నల్లమల్ల అడవుల్లో పులులు సంచరించేవి. కొన్నేళ్లుగా ఇవి తిరిగే కారిడార్ నల్లమల్ల నుంచి వైఎస్సార్, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలో శేషాచలం అడవుల వరకు విస్తరించి ఉంది. తరుచూ నిర్వహిస్తున్న పులుల గణనలో ఈ విషయం స్పష్టమైంది. నాగార్జున సాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వు (ఎన్ఎస్‌టీఆర్)వారి ఆధ్వర్యంలో పులులు గణన చేపడుతున్నారు. పులులు గణన రెండు బ్లాకులో జరుగుతోంది. నాలుగేళ్లకొకసారి చేసే గణన బ్లాక్–3లోకి వస్తుండగా , ప్రతి ఏడాది జరిపే గణన బ్లాక్–4 కిందికి వస్తుంది. ఇటీవల బ్లాక్–4లోని వార్షిక గణనలో టైగర్ కారిడార్ ప్రాంతంలో గత యేడాదిలో ఫిబ్రవరి 20 నుంచి అటవీశాఖాధికారులు గణన ప్రక్రియ చేపట్టిన సంగతి తెలిసిందే.



పెనుశిల అభయారణ్యంలో చెట్టుకు అమర్చిన కెమెరా

ఎక్కడెక్కడా..

టైగర్ కారిడార్ నంద్యాల, గిద్దలూరు, వైఎస్సార్, అన్నమయ్య, తిరుపతి డివిజన్లలో నిర్వహించారు. నంద్యాల డివిజన్‌లోని చలమరుద్రవరం (రేంజ్), గిద్దలూరులో గుండ్లకమ్మ, వైఎస్సార్ జిల్లాలో ప్రొద్దుటూరు, వనిపెంట, పోరుమామిళ్ల, బద్వేలు, సిద్దవటం, ఒంటిమిట్ట, ముద్దనూరు, అన్నమయ్య జిల్లాలో చిట్వేలు, రాయచోటి , బాలపల్లె తిరుపతి జిల్లాలో భాకరాపేట, తిరుపతి రేంజిలోని అటవీ ప్రాంతాల్లోని సాంకేతిక డిజిటల్ కెమెరాలు అమర్చిసర్వే చేశారు. ప్రతి రెండు చదరపు అడుగులకు రెండు కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ఆయా రేంజిలలో గత యేడాది 188 లోకేషన్లకు మొత్తం 376 కెమెరాలను ఏర్పాటు చేశారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 127 కెమెరాలు అమర్చారు. 40రోజుల పాటు జరిగిన గణనలో 20 రోజులకొక సారి కెమెరాలు తీసి వాటిలోని చిత్రాలను సేకరించారు. అదే ప్రదేశాలలో మళ్లీ కెమెరాలు ఏర్పాటుచేయనున్నట్లు అటవీవర్గాల సమాచారం. కెమెరాల్లోని డేటాను ఆయా అటవీశాఖాధికారులు శ్రీశైలంలోని టైగర్ బయోల్యాబ్‌కు పంపనున్నారు. వాటిలోని చిత్రాలను బయోల్యాబ్ ప్రతినిధులు క్షుణ్ణంగా విశ్లేషించనున్నారు. గత ఏడాది పోరుమామిళ్ల, వనిపెంట అడవుల్లో ఆరు పలులు కెమెరాలకు చిక్కినట్లుగా అటవీ అధికారుల నుంచి అందని ప్రాథమిక సమాచారం.

అభయారణ్యాలు

- శేషాచలం (బయోస్పియర్)
- లంకామల్లేశ్వర వన్యప్రాణి అభయారణ్యం
- పెనుశిల లక్ష్మీనరసింహా అభయారణ్యం

» పెరుగుతున్న పులుల సంఖ్య

2021లో ఆరుపులులు ఉండగా, 2022లో వాటి సంఖ్య తొమ్మిదికి చేరినట్లు అటవీ వర్గాల సమాచారం. 2019లో బద్వేలు, సిద్ధవటం అటవీ ప్రాంతాల్లో కూడా పులులు ఉండేవని అప్పటి సమాచారం. ఈ సారి గణనలో అవి కెమెరాలకు చిక్కలేదు. అయితే పెనుశిల అభయారణ్యం, శేషాచలం అటవీ ప్రాంతాల వైపు వెళ్లినట్లు అటవీవర్గాలు భావిస్తున్నాయి. చిరుతలు మాత్రం కెమెరాకు చిక్కుతున్నాయి. పెనుశిల అభయారణ్యానికి సోమశిల వెనుకజలాలు అడ్డుగా ఉండటం వల్ల రాలేకున్నాయి.



పెనుశిల లక్ష్మీనరసింహా అభయారణ్యంలో చిరుత

» ప్రాథమికంగా 8 నుంచి 10 పులులు సంచారం

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని టైగర్ కారిడార్ చేపట్టిన పులుల గణనలో ప్రాథమికంగా 8 నుంచి 10 లోపు పులులను అధికారులు గతంలో గుర్తించారు. వాటి సంఖ్య ఈ ఏడాది పెరిగి ఉంటుందని అటవీశాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అడవుల్లో అమర్చిన విదేశీ సాంకేతిక డిజిటల్ కెమెరాల ద్వారా వాటి సంఖ్యను కొనుగొన్నారు.

- శ్రీశైలంలోని టైగర్ బయోట్యాబ్‌లో శాస్త్రవేత్తలు కెమెరాల్లో లభ్యమైన చిత్రాలపై విశ్లేషణ ప్రక్రియ కొనసాగిస్తున్నారు.

అడవిలో చెట్లకు కెమెరాలు అమర్చాం



శేషాచలం అటవీ ప్రాంతంలో చెట్ల కెమెరాలు అమర్చాము. పులి, చిరుత కెమెరాలో పడితే వివరాలు వెల్లడిస్తాము. సర్వే జరుగుతోంది. టైగర్ కారిడార్ పరిధిలో పులల గణన జరుగుతుంది. –జగన్నాథ్‌సింగ్, జిల్లా అటవీశాఖాధికారి, రాజంపేట

పక్కాగా 'ఉచిత ఇసుక' అమలు

కలెక్టర్ శ్రీధర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇసుక పంపిణీ విధానాన్ని పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నూతన ఇసుక పాలసీ, ఇసుక బుకింగ్, సరఫరా, ఇసుక లభ్యత , పట్టా లాండ్స్, సెమీ మెకానిస్ట్ ఇసుక రీచ్లు వంటి అంశాలపై అమరావతి నుంచి గనులు భూగర్భ శాఖ కార్యదర్శి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, గనులు భూగర్భ శాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గనుల భూగర్భ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఉచిత ఇసుక పాలసీ పై ఆన్లైన్ రిజిస్ట్రేషన్, శాండ్ పోర్టల్ బుకింగ్ యాప్ పై అవగాహన పెంచాలన్నారు. సెమీ మెకనైజ్డ్ రీచ్ సమస్యలను పరిష్కరించి అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. ప్రజల నుంచి ఉచిత ఇసుక పాలసీపై ఫీడ్ బ్యాక్ లను సేకరించాలన్నారు. ఇసుక క్వాలిటీ విషయంలో సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ముఖ్యంగా పట్టా ల్యాండ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఆయా జిల్లాలలో ఇసుక ధరలను కలెక్టర్లు పర్యవేక్షించాలని సూచించారు. వీసీ అనంతరం కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గనులు భూగర్భ శాఖ డీడీ సూర్యచంద్రరావు, పొల్యూషన్ బోర్డ్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా గంధ మహోత్సవం



గంధాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

సిద్దవటం: మండలంలోని మాచుపల్లె గ్రామ సమీపంలో వెలసిన హజరత్ సయ్యద్ షావలి దర్గాలో శుక్రవారం రాత్రి గంధం మహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గంధాన్ని పూల చాందినిలో పకీర్ల మేళ తాళాలతో, బ్యాండ్ వాయిద్యాలతో గ్రామంలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. గంధం దర్గాచేరిన తరువాత ఫాతేహా నిర్వహించారు.కార్యక్రమంలో మాచుపల్లె గ్రామ పెద్దలు, దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల్లో న్యాయవిజ్ఞానం పెరిగేలా కృషిచేయాలి



న్యాయవాదులతో కలిసి ఐఏఎల్ డైరీని ఆవిష్కరిస్తున్న 5వ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి

రాయచోటి అర్బన్: ప్రజల్లో న్యాయవ్యవస్థ, రాజ్యాంగం, చట్టాలపై పరిజ్ఞానం పెరిగేలా భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) కృషిచేయాలని రాయ చోటి 5వ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి అన్నారు. శుక్రవారం కోర్టు ఆవరణలో నిర్వహించిన ఐఏఎల్–2025 డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశానుసారం న్యాయవిజ్ఞాన సదస్సులు దేశవ్యాప్తంగా జరుగతున్నాయన్నారు. అయినప్పటికీ ప్రజల్లో చట్టాల పట్ల, రాజ్యాంగ పట్ల మరింతగా విజ్ఞానం పెరగాల్సిన అవసరం ఉందన్నారు.

- భారత రాజ్యాంగం, చట్టాల గురించి ప్రజలందరికీ వివరించేందుకు భారత న్యాయవాదుల సంఘం వచ్చేవారం నుంచి చైతన్యసదస్సులను నిర్వహిస్తున్నట్లు ఐఏఎల్ ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట ఈశ్వర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆనంద్‌కుమార్, రెడ్డెయ్యలు అన్నారు. రాయచోటి బార్ అసోసియేషన్ అధ్య క్షుడు ఎస్.ప్రభాకరరెడ్డి, ప్రధాన కార్యదర్శి రెడ్డెయ్య. డి.నాగముని పాల్గొన్నారు.

'స్టాఫ్ నర్స్' నియామకాలకు శ్రీకారం

- వైద్య ఆరోగ్య శాఖ జోన్–4లో నోటిఫికేషన్
- 17వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ

కడప రూరల్: కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్–4 (రాయలసీమ జిల్లాలు) పరిధిలో ఎట్టకేలకు నోటిఫికేషన్ విడుదలైంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక వచ్చిన తొలి నోటిఫికేషన్ ఇదే. కాగా అంతకుముందు ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో వైద్య ఆరోగ్య శాఖలో పెద్ద ఎత్తున ఉద్యోగ నియామకాలు జరిగాయి. ప్రధానంగా కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్‌ల రిక్రూట్‌మెంట్ పెద్ద ఎత్తున జరిగింది. దీంతో వందలాది మంది అర్హులైన నిరుద్యోగులు స్టాఫ్ నర్స్‌లుగా ఉద్యోగాలు పొందారు.



అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది

జోన్–4 పరిధిలో 600కు పైగా 'స్టాఫ్ నర్స్' ఖాళీలు...

వైద్య ఆరోగ్య శాఖ అధికారులు జోన్–4 పరిధిలోని రాయలసీమ ప్రాంత జిల్లాల పరిధిలో దాదాపు 600 స్టాఫ్ నర్స్ పోస్టులు భర్తీ చేయాలని అధికారులు గుర్తించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం రాకతో నియామకాలకు అడ్డుకట్ట పడింది. దీంతో అర్హులైన వారు ఆందోళనలో పడ్డారు. తాజాగా కూటమి ప్రభుత్వం కేవలం 150 పోస్టుల భర్తీకి పచ్చ జెండా ఊపింది. అర్హులైన వారు ఈ నెల 3ఎనుంచి 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కడప పాత రిమ్స్‌లోని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం దరఖాస్తులను సమర్పించాలి. దరఖాస్తు విధానం ఇతర పూర్తి వివరాలకు సీఎఫ్‌డబ్ల్యూ.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలి. కాగా అభ్యర్థుల నుంచి దాదాపు 12 వేలకు పైగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది.

» గత ప్రభుత్వంలో 1,550పైగా నియామకాలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో వైద్య ఆరోగ్య శాఖ అత్యంత బలోపేతంగా మారింది. వెల్లువలా వివిధ కేడర్‌లకు సంబంధించిన నియామకాలు జరిగాయి. ఎంతలా అంటే ఎప్పటికప్పుడు ఖాళీలను భర్తీ చేస్తూ వచ్చారు. దీంతో అర్హులైన వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం లభించింది. కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో రాయలసీమ జిల్లాల నుంచి కేవలం స్టాఫ్ నర్స్‌ల నియామకాలు కేవలం రెండు నోటిఫికేషన్స్‌లకు గాను దాదాపు 1,550 మందికి పైగా ఉద్యోగాలు పొందడం విశేషం.

పక్కాగా ఎంపిక ప్రక్రియ



ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 150 మంది స్టాఫ్ నర్స్ నియామకాల కోసం చర్యలు చేపడుతున్నాం. అర్హులకు ఉద్యోగాలు వచ్చేలా పటిష్టవంతంగా రిక్రూట్మెంట్ ప్రక్రియను చేపడుతున్నాం. ఈ నియామకాల ద్వారా వైద్య విధాన పరిషత్ తో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎంపికైన స్టాఫ్ నర్స్ లను నియమిస్తాం.

– డాక్టర్ రామ గిడ్డయ్య, రీజనల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం

వైఎస్సార్ సీపీలో నియామకాలు

కడప కోటిరెడ్డిసర్కిల్: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ జిల్లాలకు సంబంధించి వివిధ నియామకాలు చేపడుతూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా నియోజకవర్గాల వారీగా ఈ నియామకాల వివరాలిలా ఉన్నాయి. బద్వేలు నియోజకవర్గ వైస్ ప్రెసిడెంట్‌గా రమేష్‌బాబు, ప్రొద్దుటూరుకు పి.నరసింహా రెడ్డి, పులివెందుల డి.వెంకట శశికాంత్‌రెడ్డి, కడపకు దాసరి శివ, బి. నాగయ్యయాదవ్, మైదుకూరు ఎస్.సుబ్బారెడ్డి, కమలాపురం ఎం.వెంకట సుబ్బారెడ్డి, జమ్మలమడుగు పి.వెంకట రమణారెడ్డిలను నియమించారు. అలాగే మైదుకూరు నియోజకవర్గ ట్రెజరర్‌గా ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డిని నియమించారు. ఇక బద్వేలు నియోజకవర్గ జనరల్ సెక్రటరీగా పి.బ్రహ్మానందరెడ్డి, కమలాపురం ఎల్.రాజశేఖర్‌రెడ్డి పులివెందుల బి.ఈశ్వర్‌రెడ్డి, మైదుకూరు పీవీ రాఘవ రెడ్డి, జమ్మలమడుగు జనరల్ సెక్రటరీగా పి.శివారెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బద్వేలు ఆర్గనైజేషనల్ సెక్రటరీలు జి.హరికృష్ణారెడ్డి, ఆర్.నరసింహులు, కమలాపురం పి.వాసుదేవరెడ్డి , ప్రొద్దుటూరు జి.రాజారాంరెడ్డి, ఎస్.వెంకట రమణారెడ్డి , కమలాపురం వై.నిరంజన్‌రెడ్డి, పులివెందుల కె.భాస్కర్, చంద్రశేఖర్, కడప టి.కృష్ణయ్య , ఎస్.చాంద్‌బాష, మైదుకూరు కిరణ్‌మియా, ఎం.సుధాకర్‌రెడ్డి, బద్వేలు పి.లక్ష్మినరసారెడ్డి, జమ్మలమడుగుకు సి.లక్ష్మికాంత్‌రెడ్డి , బోనం సురేష్‌లను నియమించారు.

సెక్రటరీ యాక్టివిటీలు: టి.నాగేశ్వరరావు, రాజశేఖర్ రెడ్డి (బద్వేలు), ఎం.వీరారెడ్డి , జి. శ్రీనివాసుల రెడ్డి (కమలాపురం) టి.మారుతిప్రసాద్ (ప్రొద్దుటూరు), ఎస్.నీలవర్ధన్‌రెడ్డి, ఎస్ఎం నూరుల్లా (పులివెందుల), మునిశేఖర్‌రెడ్డి, టి. రమేష్ రెడ్డి, (కడప), సి.మహబూబ్‌బాషా, ఎం. చిన్న వెంకట సుబ్బయ్య (మైదుకూరు), పి.రాజశేఖర్‌రెడ్డి (బద్వేలు), సుమంత్, ఎస్. శీనయ్య, బి. సమీర్ అలీ (జమ్మలమడుగు)

అధికార ప్రతినిధులు: బి.రామసుబ్బారెడ్డి (బద్వేలు) ఐ.శంకర్‌రెడ్డి (కమలాపురం), జి.వెంకట సుబ్బయ్య (ప్రొద్దుటూరు), ఎం.పుష్పనాథరెడ్డి (పులివెందుల), జయచంద్రారెడ్డి (కడప), ఎస్.మోహన్‌రెడ్డి, (జమ్మలమడుగు), ఎం.వినయ్‌కుమార్ (మైదుకూరు)

దరఖాస్తుల ఆహ్వానం

కడప రూరల్: వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్–4 పరిధిలో కాంట్రాక్ట్ ఫార్మసిస్ట్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రామ గిడ్డయ్య తెలిపారు. 15 ఖాళీలు ఉన్నాయని.. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తు నమూనాను సీఎఫ్ డబ్ల్యూ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్ లోడ్ చేసుకొని, భర్తీ చేసిన దరఖాస్తులను నిర్దేశించిన రుసుముతో పోస్టుకు సంబంధించిన సర్టిఫికెట్లను జతపరచాలని తెలిపారు. పూరించిన దరఖాస్తులను ఈ నెల 4 నుంచి 17వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కడప పాత రిమ్స్ లో గల వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

ఉప కులాల సమాచారం ఇవ్వండి

- అధికారులకు ఏకసభ్య కమిషన్ రాజీవ్‌రంజన్ మిశ్రా ఆదేశం
- కమిషన్‌కు వెల్లువెత్తిన వినతులు

కడప సెవెన్‌రోడ్స్: ఉప కులాల వారీగా విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ఉన్న షెడ్యూల్డ్ కులాల సమాచారాన్ని అందజేయాలని ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్‌మిశ్రా జిల్లా అధికారులను ఆదేశించారు. షెడ్యూల్డ్ కులాల వర్గీకరణపై అభిప్రాయ సేకరణ కోసం శుక్రవారం ఆయన జిల్లాకు వచ్చారు. కలెక్టరేట్ సభా భవనంలో తొలుత అన్ని శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. 2024–25 నాటికి జిల్లాలో 3165 మంది షెడ్యూల్డ్ కులాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని అధికారులు వివరించారు. ఇందులో మాలలు 1923, మాదిగలు 1069, ఇతరులు 173 మంది ఉన్నారని పేర్కొన్నారు. దీనిపై కమిషన్ స్పందిస్తూ ఆది ఆంధ్ర, రెల్లి, డెక్కలి తదితర ఎస్సీ ఉప కులాలకు చెందిన వారు ఎవరూ లేరా? అంటూ ప్రశ్నించారు. సర్వీసు రిజిష్టర్లలో మాల, మాదిగ, ఇతరులు అని మాత్రమే ఉన్నాయని అధికారులు బదులిచ్చారు. మిగతా జిల్లాల్లో ఉప కులాల వారీగా వివరాలు ఇస్తున్నారని, కేవలం ఈ జిల్లా లో మాత్రమే ఉపకులాలను ఇతరుల్లో చూపుతున్నారని తెలిపారు. ఉద్యోగాలతోపాటు విద్య, స్వయం సహాయక సంఘాలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రభుత్వ పథకాల్లో ఉన్న ఎస్సీల వివరాలను ఉపకులాల వారీగా తమకు సమర్పించాలని ఆదేశించారు. కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ డేటా సేకరిస్తున్నారని, నిర్దిష్ట సమయంలోపు వివరాలను కమిషన్‌కు సమర్పిస్తామన్నారు. జేసీ అదితి సింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, సాంఘిక సంక్షేమశాఖ డీడీ సరస్వతి పాల్గొన్నారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు.



రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతిపత్రమిస్తున్న దివ్యాంగుడు



ర్యాలీగా వస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు

రాష్ట్రం యూనిట్‌గా వర్గీకరణ

రాష్ట్రం యూనిట్‌గా ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరించి సామాజిక న్యాయం చేయాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు పిచ్చుక బాబు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు సురేష్ మాదిగ, మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వైతే విశ్వనాథ్, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షులు కేఎస్ రాజు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, బేడ బుడగజంగం రాష్ట్ర నాయకుడు కొండయ్య తదితరులు కోరారు. ఉమ్మడి రిజర్వేషన్లు నష్టదాయకమన్నారు.

- 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరించాలని అభ్యుదయ చైతన్యవేదిక గౌరవాధ్యక్షులు రాజేశ్వరరావు కోరారు. వర్గీకరణ జిల్లా ప్రాతిపదికన జరగరాదని కోరారు.

బుడగజంగాలను ఆదుకోండి

ఎస్సీ కులాల్లోని తాము భిక్షాటన చేస్తూ కడు దయనీయ పరిస్థితుల్లో జీవిస్తున్నామని ఏపీ బుడగ జంగం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు యలమర్తి మధు, నాయకులు పస్తం అంజి కోరారు. ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరిస్తే ఉప కులాలైన తమకు న్యాయం జరగుతుందని తెలిపారు.

- ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించి మాదిగ, ఉపకులాలకు న్యాయం చేయాలని సీమాంధ్ర దళిత ప్రజాసేన అధ్యక్షులు పెద్దుళ్లపల్లె ఓబులపతి, మల్లికార్జునలు కోరారు.
- ఎస్సీల్లో డక్కలి, ఆరమాల, సాయిమాల వంటి 59 కులాలు ఉన్నాయని ఏపీ దళితమిత్ర సంఘం అధ్యక్షులు కైపు రామాంజనేయులు పేర్కొన్నారు.
- జనాబా దామాషా మేరకు రిజర్వేషన్ల వర్గీకరణ జరగాలని సీపీఐ అనుబంధ దళిత హక్కుల పోరాట సమితి కార్యదర్శి కె.మునెయ్య కమిషన్‌ను కోరారు.

క్షేత్ర స్థాయిలో విచారణ జరగాలి

షెడ్యూల్ కులాల స్థితిగతులను తెలుసుకునేందుకు జిల్లా కేంద్రంలో కాకుండా క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవాలని జిల్లా దళిత ఫోరం చైర్మన్ భూశిపాటి కిశోర్‌కుమార్, నాయకులు శ్రీరాములు, డాక్టర్ పెంచలయ్యలు కోరారు. ఎస్సీ వర్గీకరణ తగదని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు జయరాజ్, జై భీమ్ మాల మహాసేన నాయకులు సంపత్‌కుమార్, చైతన్య, సీహెచ్ వినోద్‌కుమార్‌లు కోరారు.

క్లుప్తంగా

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

పెద్దముడియం : మండలంలోని కొండసుంకేసుల గ్రామంలో మేడిగం మహేశ్వరరెడ్డి(41) అనే రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మహేశ్వరరెడ్డి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. అతనికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. తనకు ఉన్న 8 ఎకరాల పొలంతో పాటు మరో 6 ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసేవాడు. గత రెండు సంవత్సరాల నుంచి పంటలు సరిగా పండకపోవడంతో దాదాపు 10 లక్షల మేర అప్పులు అయ్యాయి. ఈ సంవత్సరం సాగు చేసిన మిరప, శనగ పంటలు వరుస వర్షాలకు దెబ్బతినటంతో అప్పులు తీర్చలేమోనని తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. గురువారం రాత్రి ఇంటిలోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.

భార్యను వేధించిన భర్తపై కేసు

ముద్దనూరు : డబ్బులు ఇవ్వడం లేదని భార్యను వేధించి గాయపరచిన సంఘటనలో భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ మైనుద్దీన్ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెనికలపాడు గ్రామానికి చెందిన సాంబశివుడు నిత్యం తాగి డబ్బుల కోసం భార్య గంగను వేధించేవాడు. శుక్రవారం ఉదయం డబ్బులు కావాలని భార్యను వేధించగా.. ఆమె డబ్బులు ఇవ్వకపోవడంతో కట్టెతో దాడి చేశాడు. ఈ సంఘటనలో ఆమె తలకు గాయమైంది. దీంతో స్థానికంగా ప్రథమ చికిత్స అనంతరం ఆమె ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు సాంబశివుడిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాగేందుకు డబ్బు ఇవ్వలేదని.. తండ్రిని చంపేశాడు



వెంకటస్వామి మృతదేహం

ప్రొద్దుటూరు క్రైం : మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వలేదని తండ్రినే హత్య చేసిన ఘటన ప్రొద్దుటూరులోని మోడంపల్లెలో చోటు చేసుకుంది. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మోడంపల్లెలోని దళితవాడకు చెందిన రెడ్డిపోగుల వెంకటస్వామి (65) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతనికి భార్య లక్ష్మీదేవితోపాటు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వీరిలో వెంకటసుబ్బయ్య అనే కుమారుడు ఆటోనగర్‌లోని ఓ ఐరన్ షాపులో పని చేస్తున్నాడు. అతను ఇటీవల తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వాలని గురువారం రాత్రి తండ్రిని అడిగాడు. డబ్బులు లేవని చెప్పడంతో ఇంట్లో ఉన్న కట్టె తీసుకొని వెంకటస్వామి తలపై కొట్టాడు. తలకు తీవ్ర రక్తస్రావమై అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు.

చిట్టి బుర్రలు.. గట్టి ఆవిష్కరణలు

- ఆలోచనలు వినూత్నం.. ఆవిష్కరణలు అద్భుతం
- జిల్లా విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో ఆకట్టుకున్న ప్రాజెక్టులు
- జిల్లా నలుమూలల నుంచి 86 నమూనాలు హాజరు

చిట్టి బుర్రలు అద్భుతాలు సృష్టించాయి. మన చుట్టూ ఉన్న సమస్యలే వారిని ఆలోచింపజేశాయి. వాటికి పరిష్కార మార్గాలను చూపించేలా ఆవిష్కరణల వైపు నడిపించాయి. విద్యార్థులు సరికొత్త ప్రాజెక్టులు రూపకల్పన చేసి ఔరా అనిపించారు. కడప మున్సిపల్ హైస్కూల్ (మెయిన్)లో జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన వేదికగా ఏర్పాటు చేసిన వీరి నమూనాలు వీక్షకులను అబ్బుర పరిచాయి.



రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైన ప్రాజెక్టుల విద్యార్థులు, ఉపాధ్యాయులతో అతిథులు, జిల్లా అధికారులు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్‌లో డిప్యూటీ ఈవో రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో, జిల్లా సైన్సు అధికారి ఎబినైజర్ ఇమ్మాన్యుయేలు అధ్యక్షతన శుక్రవారం జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఆలోచనలు సృజనాత్మకంగా ఉండాలని తెలిపారు. వారు ఉజ్వల భవిష్యత్తు నిర్మించుకునే విధంగా అడుగులు వేయాలని ఆకాంక్షించారు. డిప్యూటి ఈవో రాజగోపాల్‌రెడ్డి, జిల్లా సైన్సు అధికారి ఎబినైజర్ ఇమ్మానుయేలు మాట్లాడుతూ జిల్లాలోని 36 మండలాల నుంచి అన్ని విభాగాలకు సంబంధించి 108 ప్రాజెక్టులకుగాను 86 ప్రాజెక్టులు ప్రదర్శించారన్నారు. ఇందులో చక్కటి ప్రాజెక్టులను మొదటి రెండు స్థానాల్లో ఎంపిక చేసినట్లు తెలిపారు. వారు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీల్లో పాల్గొంటారని తెలియజేశారు. అనంతరం సౌత్ ఇండియా లెవెల్‌లోని పాండిచ్చేరిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. న్యాయ నిర్ణేతలుగా విచ్చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ పత్తి వెంకటకృష్ణారెడ్డి, డాక్టర్ సుధాకర్‌రెడ్డి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఉత్తమ ప్రాజెక్టులు రూపొందించిన విద్యార్థులు, ఉపాధ్యాయులను శాలువాలు మెమెంటోలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హైస్కూల్ మెయిన్ హెచ్‌ఎం నాగమణి, 25వ డివిజన్ కార్పొరేటర్ సూర్యనారాయణ, డీసీఈబీ సెక్రటరీ భాస్కర్‌రెడ్డి, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ సాంబశివారెడ్డి, సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్ కేశవరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, మాజీ సైన్సు అధికారులు రెహమాన్, నిత్యానందరెడ్డి, సైన్సు టీచర్స్ గంగాధర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రాజెక్టుతో విద్యార్థి జరీనా

ప్రాజెక్టు పేరు : అవాయిడ్ బెడ్ సోర్సెస్ ఫ్రం బెడ్ రీడెన్ పర్సన్స్
విద్యార్థులు : జరీనా
తరగతి : 9
పాఠశాల పేరు : జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్, ముద్దనూరు
మండలం : ముద్దనూరు

ఎవరికైనా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, ఏ కారణాలతోనైనా కాలు విరిగినప్పుడు, అలాగే పెరాలసిస్ ఉన్న వారికి, మెంటల్ డిసీజ్ ఉన్న వారు మంచానికే పరిమితం కావాల్సి ఉంటుంది. అలాంటప్పుడు వారు అలాగే పడుకుని ఉండటం వల్ల.. వారి వీపునకు పడకరాపులు(రాసెస్) వచ్చే అవకాశం ఉంటుంది. ఇలాంటివి రాకుండా ఉండేందుకు సర్క్యూట్ అండ్ స్విచ్‌లతో తయారు చేసిన ఈ బెడ్‌తో ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఈ మంచాన్ని రెండు విభాగాలుగా తయారు చేస్తారు. ఒక పక్క సగంలో బెడ్‌ను ఏర్పాటు చేస్తారు. మరో పక్క రంధ్రాలతో కూడిన చెక్కను ఏర్పాటు చేసి దాని కింద ఫ్యాన్, హీటర్, పాస్ పోయేందుకు వీలుగా టబ్బును ఏర్పాటు చేస్తారు. పరుపు కింద సర్క్యూట్‌తో కూడిన బజర్‌ను ఏర్పాటు చేస్తారు. మంచంలో ఉండే వ్యక్తి తడి చేయగానే అబర్ మోగుతుంది. దీంతో ఆయనను పక్కన ఏర్పాటు చేసిన దానిపైన పడుకోబెట్టి ఫ్యాన్‌ను ఆన్ చేస్తారు. దీంతో శరీరంపై ఉండే తడి ఆరిపోవడంతోపాటు బెడ్‌ను ఆరబెడతారు. దీంతో బెడ్‌పై ఉండే వ్యక్తికి ఎలాంటి పడక రాపులు(రాసెస్) రాకుండా ఉంటాయి.

రాష్ట్ర స్థాయికి ఎంపిక

విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డితో పాటు జ్యూరీ సభ్యులు పరిశీలించారు. ఇందులో వ్యక్తిగత, గ్రూపు విభాగంలో విద్యార్థులు, టీచర్స్ విభాగంలో ఉపాధ్యాయులు రూపొందించిన నమూనాల్లో.. ప్రతి విభాగంలో రెండు అద్భుతంగా ఉన్న వాటిని ఎంపిక చేశారు. వాటిని రాష్ట్ర స్థాయి ప్రదర్శన పోటీలకు పంపనున్నారు.

వ్యక్తిగత విభాగం నుంచి..

స్టూడెంట్ పేరు	ఎగ్జిబిట్ పేరు	స్కూల్ పేరు
జరీనా	అవైడ్ బెడ్ సోర్సెస్‌ఫర్ బెడ్ రీడెడ్ పెసెంట్స్	జెడ్పీ బాలికల హైస్కూల్ ముద్దనూరు
గౌరీశంకర్	సీఓటు కలెక్టర్ అట్ సిగ్నల్‌జోన్	పీహెచ్‌ఎస్ మెయిన్ పులివెందుల

గ్రూప్ విభాగంలో...

వేదవర్షన్, నిరంజన్	రైల్వే రోప్ ఎలివేట్	ఎంసీహెచ్‌ఎస్, కడప
గురుధరణి, షఫియా	వాటర్‌లెవల్ మానిటరింగ్ అట్ రైల్వే బ్రిడ్జి టు అవైడ్ యాక్సిడెంట్స్	కేజీబీవీ, దువ్వూరు

టీచర్స్ విభాగంలో...

పుష్పలత	గ్రే వాటర్ – గ్రీన్ ఫ్యూచర్	జెడ్పీ హైస్కూల్ ఎగువపల్లి
అరుణమ్మ	ఇన్‌ఫ్యాంట్ ప్రొటెక్షన్ సిస్టమ్	కేజీబీవీ, దువ్వూరు

ప్రాజెక్టు పేరు : లిక్విడ్-3
విద్యార్థులు : సాయి జ్యోతిష్, జ్ఞానేశ్వర్‌రెడ్డి
తరగతి : 10
పాఠశాల పేరు : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆహోబిలాపురం
మండలం : పులివెందుల



ప్రాజెక్టుతో సాయిజ్యోతిష్, జ్ఞానేశ్వర్‌రెడ్డి

నేడు ఢిల్లీ, ముంబయి లాంటి మహా నగరాల్లో వాతావరణ కాలుష్యం కారణంగా సరైన ఆక్సిజన్ అందక ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి సమస్యను అధిగమించేందుకు (తక్కువ విస్తీర్ణంలో) నీటి ట్యాంకుల్లో స్పైరులీనా పెంపకం వల్ల సులభంగా ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసి నిల్వ చేసుకోవచ్చు. దీంతోపాటు ఈ స్పైరులీనా కార్బన్‌డయాక్సైడ్‌ను తీసుకుని ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేయడం దీని ప్రత్యేకత. అంతేకాదు 20 ఏళ్ల వయసున్న చెట్టు ఒక్క రోజులో ఇచ్చే ఆక్సిజన్‌ను ఈ స్పైరులీనా మొక్క ఒక్క రోజులో దానికి డబుల్ ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేస్తుంది. దీంతోపాటు ఇది చాలా ఫ్రెష్ ఆక్సిజన్.

ప్రాజెక్టు పేరు : రైల్వే రోప్ ఎలివేటర్
విద్యార్థులు : వేదవర్షణ్, నిరంజన్
తరగతి : 10
పాఠశాల పేరు : మున్సిపల్ హైస్కూల్ మెయిన్
మండలం : కడప



రైల్వేరోప్ ఎలివేటర్ ప్రాజెక్టులో విద్యార్థులు వేదవర్షణ్, నిరంజన్

పెద్ద నగరాల్లో ఉండే రైల్వేస్టేషన్లలో ఎక్కువ ప్లాట్‌ఫామ్స్ ఉంటాయి. ఆ ప్లాట్‌ఫామ్‌లకు వృద్ధులు, వికలాంగులు మెట్ల ద్వారా నడిచి వెళ్లాలంటే చాలా కష్టం. అలాంటి వారిని ఒక ప్లాట్‌ఫామ్ నుంచి మరో ప్లాట్‌ఫామ్‌కు తరలించేందుకు రైల్వే రోప్ ఎలివేటర్ ఎంతగానో ఉపయోగపడుతుంది. దీని ద్వారా ఒకసారి 6 నుంచి 8 మందిని సులభంగా తరలించవచ్చు. ఇలా రోప్ ఎలివేటర్‌లో ప్లాట్‌ఫామ్ నంబర్‌ను కొడితే.. ఆ ప్లాట్‌ఫామ్ మీదికి రోప్ వే ద్వారా సులభంగా చేరుకోవచ్చు. ఇది వృద్ధులకు, వికలాంగులకు ఎంతగానే ఉపయుక్తంగా ఉంటుంది.

ప్రాజెక్టు పేరు : సేవ్ ద ఎర్త్
విద్యార్థులు : రేష్మాబీ, అభినిషా
తరగతి : 9
పాఠశాల పేరు : ఎంపీయూపీఎస్, రెడ్డికొట్టాల
మండలం : కాశినాయన



ప్రాజెక్టుతో విద్యార్థులు రేస్మాబీ, అభినిషా

నేడు అడవులు, పశు సంపద అంతరించి పోతున్నాయి. ఫలితంగా గ్లోబల్ వార్మింగ్ పెరిగి వాతావరణంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఫలితంగా అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయి. దీంతో రైతులకు పంటల నష్టంతో పాటు అనేక రకాల ఇబ్బందులు చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటి తరుణంలో ప్రతి ఒక్కరూ చెట్లు పెంచడం, అడవులు అభివృద్ధి చేయడంతోపాటు పశు సంపదను వృద్ధి చేయాలి. తద్వారా పచ్చదనం పెరిగి సకాలంలో వర్షాలు కురవడం, వాతావరణంలో మార్పులు చోటు చేసుకోకుండా ఉండటం వంటివి జరుగుతాయి. దీంతో మానవ మనుగడ ప్రశాంతంగా ఉంటుంది.

నూతన సీఎస్ విజయానంద్ మనోడే



విజయానంద్ చిత్రపటం ఊరేగింపు

జమ్మలమడుగు : నూతన ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా పదవీ బాధ్యతలు చేపడుతున్న విజయానంద్ మన జిల్లా వాసే. దీంతో ఆయన చిత్రపటాన్ని జమ్మలమడుగు మండల పరిధిలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో ఊరేగింపుగా తీసుకెళ్లి పాలాభిషేకం చేశారు. శుక్రవారం మాజీ తుంగభద్ర హైలెవల్ బ్రాంచ్ కెనాల్ అధ్యక్షుడు ఉప్పలపాడు శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రజలు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉప్పలపాడు గ్రామాన్ని దత్తత తీసుకుని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడంలో విజయానంద్ కీలక పాత్ర పోషించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ప్రధాన కార్యదర్శిగా పదవీ బాధ్యతలు చేపడుతున్న విజయానంద్‌కు అభినందనలు తెలుపుతున్నట్లు చెప్పారు. గ్రామంలోని అన్ని ఆలయాల్లో ఆయన పేరుమీద ప్రత్యేక పూజలు చేయిస్తామన్నారు.

విలేకరిపై టీడీపీ నేతలు కర్రలతో దాడి

- దాడి చేసిన వారిపై కేసు నమోదు
- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు



బాధితుడు భాస్కర్‌రెడ్డి

తొండూరు : తొండూరులో ఓ దినపత్రిక(సాక్షి కాదు) విలేకరి ఎస్.భాస్కర్‌రెడ్డిపై శుక్రవారం ఉదయం టీడీపీ నాయకులు కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ ఘటనకు సంబంధించి తొండూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బాధితుడు పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సందర్భంగా రిపోర్టర్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తొండూరు మండలం ఇనగలూరు గ్రామానికి చెందిన కొంత మంది టీడీపీ నాయకులు ఉద్దేశ పూర్వకంగా దాడి చేశారన్నారు. ఇనగలూరు గ్రామానికి చెందిన మూరంరెడ్డి ఓబుల్‌రెడ్డి అనే రైతుకు చెందిన చీనీ చెట్లకు అధికారులు బిల్లులు పెట్టకపోవడంతో ఆ రైతు విలేకరులను సంప్రదించారన్నారు. దీంతో విలేకరులు గురువారం సాయంత్రం బిల్లుల విషయమై ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి ఎంపీడీఓ విష్ణు ప్రసాద్‌ను కలిసి వివరణ కోరగా.. రేపు ఉదయం ఆ రైతుకు సంబంధించిన బిల్లులు పెడతామని, సమస్య లేకుండా చేస్తామని తెలిపారన్నారు. తాము ఇంటికి వెళ్లే సమయంలో ఇనగలూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ప్రశాంత్ కుమార్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, గంగిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డిలు వెంబడించారని, అక్కడ విలేకరులందరూ ఉండటంతో తనను ఏమీ చేయలేకపోయారన్నారు. ఈ విషయమై శుక్రవారం ఉదయం ఎస్ఐకి ఫిర్యాదు చేయడానికి వెళుతున్న సమయంలో.. తొండూరు బస్టాఫ్ వద్దకు రాగానే కారులో వారు వచ్చి తనను ఆపి కర్రలతో తీవ్రంగా కొట్టి దాడి చేసి పరారయ్యారన్నారు. ఈ ఘటనకు సంబంధించి తొండూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, అనంతరం చికిత్స నిమిత్తం పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చానని తెలిపారు.

నేడు వృద్ధుడి మృతదేహానికి పోస్టుమార్టం



అల్లాడుపల్లె వీరారెడ్డి మృతి కేసులో నిందితులుగా ఉన్న హరినాథరెడ్డి, నరసింహా (ఫైల్)



సీసీ ఫుటేజీలో బయటపడ్డ వృద్ధుడిని హత్య చేస్తున్న యువకుల దృశ్యం


మైదుకూరు : మున్సిపాలిటీ పరిధిలోని శెట్టివారిపల్లెలో హత్యకు గురైన అల్లాడుపల్లె వీరారెడ్డి అనే వృద్ధుడి మృతదేహానికి శనివారం పోస్టుమార్టం నిర్వహించనున్నారు. గత డిసెంబర్ 6వ తేదీన వృద్ధుడు వీరారెడ్డి మృతి చెందగా సహజ మరణంగా భావించి అంత్యక్రియలు చేశారు. అయితే ఆయన మృతిపై రెండో భార్య కుమారుడు రమేష్ అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు రంగంలోకి దిగిన విషయం తెలిసిందే. వీరారెడ్డి పెద్ద భార్య మనవడు హరినాథ్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేస్తున్నారు. విచారణలో భాగంగా శనివారం వీరారెడ్డి మృతదేహాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం చేయించనున్నట్టు అర్బన్ సీఐ సయ్యద్ హాసం తెలిపారు.

సవరణ : సాక్షిలో శుక్రవారం 'డామిట్ కథ అడ్డం తిరిగింది' కథనంలో చిత్రాలు తప్పుగా ప్రచురితమైన విషయాన్ని గమనించగలరు.

ట్రాక్టర్ల దొంగతనం కేసు నమోదు

సింహాద్రిపురం : సింహాద్రిపురంలో ట్రాక్టర్ల ట్రాలీల దొంగతనం కేసు నమోదైనట్లు ఎస్ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం అంకాలమ్మ గూడూరు చెందిన కె.శ్రీనివాసరెడ్డి తన ట్రాక్టర్ ట్రాలీ దొంగలు తీసుకెళ్లినట్లు ఫిర్యాదు చేశాడు. పోలీసులు రంగం ప్రవేశం చేసి వివిధ మండలాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. తొండూరు మండలం మల్లేల గ్రామంలో ట్రాక్టర్, రెండు ట్రాలీలను గుర్తించి పట్టుకున్నారు. వీటిని సింహాద్రిపురానికి చెందిన బాబా ఫక్రుద్దీన్ అలియాస్ చోటు దొంగలించినట్లు నిర్ధారించి కేసు నమోదు చేశారు. అతడిని అరెస్ట్ చేశారు.

రేషన్ బియ్యం బస్తాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం బస్తాలతో రెవెన్యూ అధికారులు

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని లింగాపురం గ్రామ సమీపంలో ఉన్న ఆటో నగర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 184 బస్తాల చౌక బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. తమకు వచ్చిన సమాచారం మేరకు తహసీల్దార్ గంగయ్య, పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున శుక్రవారం దాడులు నిర్వహించారు. 184 బస్తాల చౌక బియ్యాన్ని స్వాధీనం చేసుకుని స్థానిక పౌరసరఫరాల శాఖ గోడౌన్‌కు తరలించారు. అనంతరం అనాలసిస్ రిపోర్ట్‌కు బియ్యం శాంపిళ్లను పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌కు పంపి పంచనామా చేశారు. ఈ బియ్యం బస్తాలను విజిలెన్స్ అధికారులు జవహర్‌రెడ్డి, ఏఓ బాలగంగాధర్‌రెడ్డిలు పరిశీలించారు. ఈ దాడులలో ఆర్ఐ మహేంద్రారెడ్డి, వీఆర్‌ఓ రామయ్య, రూరల్ పోలీసులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ

కడప అర్బన్ : కడప నగరంలోని రిమ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో పాలకొండలు జంక్షన్ దగ్గర పోలీసుల తనిఖీలో సుమారు ముప్పై వేల విలువ గల 6 కిలోల గంజాయిని రామకృష్ణనగర్‌కు చెందిన కాకి శివ అలియాస్ శివమణి దగ్గర నుంచి రిమ్స్ సీఐ తన సిబ్బందితో పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన రిమ్స్ ఎస్ఐ జయరాముడు, సిబ్బందిని కడప రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి అభినందించారు.

వైఎస్సార్‌సీపీ నేత జల్లా సుదర్శన్‌రెడ్డికి పరామర్శ



జల్లా సుదర్శన్‌రెడ్డితో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా, వైఎస్సార్‌సీపీ నేతలు

- అన్యాయంగా కేసు పెట్టి ఇరికించారు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి
- మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా

కడప అర్బన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని గాలివీడు ఎంపీడీఓ జవహర్‌బాబుపై దాడి కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న న్యాయవాది, వైఎస్సార్‌సీపీ నేత జల్లా సుదర్శన్‌రెడ్డి, ఇతర నేతలకు బెయిల్ రావడంతో కడప కేంద్ర కారాగారం నుంచి శుక్రవారం విడుదలయ్యారు. వారు రిమ్స్ సమీపంలోని విన్యాస్ అపార్ట్‌మెంట్ వద్ద ఉన్న జల్లా సుదర్శన్‌రెడ్డి నివాసంలో విశ్రాంతి తీసుకునేందుకు వెళ్లారు. ఆయన నివాసానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు సుభాన్‌బాషా, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, పులి సునీల్‌కుమార్, ఎస్ఎండీ షఫీ తదితర నేతలు వెళ్లి కలిశారు. జల్లా సుదర్శన్‌రెడ్డిని పరామర్శించి, ఆయన యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను టార్గెట్ చేసి కేసులను అన్యాయంగా బనాయిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ఈ విధానాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. సరైన సమయంలో వారే బుద్ధి చెబుతారన్నారు.

మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

మదనపల్లె : ప్రేమ వివాహం చేసుకొని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. చిత్తూరు జిల్లా పూతలపట్టుకు చెందిన నాజున్ని (22)కి మదనపల్లి పట్టణ శివాజీ నగర్‌కు చెందిన హరీష్ ప్రేమ పేరుతో దగ్గరయ్యాడు. అనంతరం బాధితురాలని వదిలించుకోవాలని చూడగా, ఆమె పూతలపట్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో 2023 నవంబర్ మూడో తేదీన హరీష్‌ను స్టేషన్‌కు పిలిపించి, ప్రేమ వివాహం చేసుకునేలా ఒప్పించి సమస్యను పరిష్కరించారు. దీంతో నాజున్ని, హరీష్ ఇద్దరు ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే కొద్ది కాలం అనంతరం తిరిగి హరీష్ ఆమెను నిర్లక్ష్యం చేసి వదిలి వచ్చేశాడు. ఆమె శుక్రవారం మదనపల్లెకు చేరుకుని తనకు జరిగిన అన్యాయంపై టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దాడి కేసులో వ్యక్తి అరెస్ట్

చాపాడు : మండల పరిధిలోని టీఓపల్లె లైన్‌మెన్‌గా పని చేస్తున్న సుబ్బరాయుడు అనే వ్యక్తిపై దాడి చేసిన ఇదే గ్రామానికి చెందిన కె.సుబ్బరాయుడును శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. పది రోజుల క్రితం టీఓపల్లె గ్రామంలో విద్యుత్ సమస్యపై చిన్న పిల్లలను లైన్‌మెన్ మందలిస్తుండగా అక్కడే ఉన్న దళితవాడకు చెందిన కె.సుబ్బరాయుడు తననే లైన్‌మెన్ తిడుతున్నాడని భావించి దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో గాయపడిన లైన్‌మెన్ తనపై దాడి చేసిన సుబ్బరాయుడుపై పోలీసుకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ చెప్పారు.